సాక్షి శ్రీకాకుళం

శుక్రవారం । 31 । మార్చి । 2023



క్రీడలతో ఉద్యోగావకాశాలు

బొడ్డపాడులో పోలీసులు నిర్వహించిన ఆటల పోటీలు ముగిశాయి. ఎస్పీ విజేతలకు బహుమతులు అందించారు.

- 8లో



కన్నీటి కథ

ఓ కుటుంబం సమాజం నుంచి సహాయం కోరుతోంది. ఇల్లాలి ప్రాణాలు కాపాడడానికి తాపత్రయ పడుతోంది.

- 8లో

నేడే ఆఖరు రోజు



శ్రీకాకుళం (పీఎన్ కాలనీ) : ఇంటి పన్ను, ఖాళీ స్థలం పన్నులను వడ్డీ లేకుండా చెల్లించేందుకు శుక్రవారం ఆఖరు తేదీ అని శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ చల్లా ఓబులేసు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి చెల్లించాలని కోరారు. బకాయిలు చెల్లించిన వారికి వడ్డీ మాఫీ జరుగుతుందని తెలిపారు.

ఇఫ్తార్	సహర్
శుక్ర (సా॥)	ఆది (ఉ॥)
6.11	4.31

రంజాన్ వేళలు

న్యూస్‌రీల్

జాతీయ పోటీలకు మేనేజర్‌గా అర్జున్‌రెడ్డి



జి.అర్జున్‌రావు రెడ్డి

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ సెపక్‌తక్ర చాంపియన్‌షిప్ పోటీలకు మేనేజర్‌గా జిల్లాకు చెందిన జి.అర్జున్‌రావురెడ్డి నియమితులయ్యారు. మహారాష్ట్రలోని నాగపూర్ వేదికగా ఏప్రిల్ ఒకటి నుంచి 5వ తేదీ వరకు 33వ ఆలిండియా సీనియర్స్ సెపక్‌తక్ర చాంపియన్ షిప్ పోటీలు జరగనున్నాయి. ఈ పోటీల్లో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ జట్టుకు మేనేజర్‌గా శ్రీకాకుళం జిల్లా సెపక్‌తక్ర అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి నియామకమయ్యారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సెపక్‌తక్ర సంఘం ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు నుంచి నియామక ఉత్తర్వులు అందుకున్నారు. జాతీయ పోటీలకు అర్జున్ మేనేజర్‌గా నియామకం కావడంపై ఆ సంఘం జిల్లా చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి, అధ్యక్షుడు ఎంపీ స్వరూప్, ఉపాధ్యక్షుడు ఎస్వీడీ మురళి, అమరావతి శ్రీను, ఎన్‌సీఎస్ శ్రీకాంత్, పైడి శీను, కోశాధికారి బీవీఎస్ఎన్ రాజు, వేణుగోపాల్ రెడ్డి, బాబ్జి, మహేష్‌బాబు, సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేశారు.

ఎలుగు దాడి బాధితులకు వైద్య ఖర్చులు అందజేత



చెక్కులను చూపిస్తున్న బాధితులు. చిత్రంలో అటవీశాఖాధికారి

వజ్రపుకొత్తూరు రూరల్: వజ్రపుకొత్తూరులో గత ఏడాది జరిగిన ఎలుగు దాడిలో తీవ్రంగా గాయపడిన బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన వైద్య ఖర్చులను గురువారం అటవీ శాఖ కాశీబుగ్గ రేంజర్ మురళీకృష్ణంనాయుడు అందజేశారు. ఒక్కో బాధితుడికి దాడి తీవ్రతను బట్టి పరిహారం అందించారు. కలిశెట్టి అప్పలస్వామికి రూ.2,85,665లు, ఉప్పరపల్లి సంతోష్‌కు రూ.2,43,208లు, పోతనపల్లి తులసీరావుకు రూ. 1,15,578లు చెక్కులను అందించారు. ఈ ఎలుగు దాడిలో ఇద్దరు మృతి చెందగా మరో ముగ్గురు తీవ్ర గాయాలై ప్రభుత్వ సహకారంతో మెడికవర్ ఆస్పత్రిలో చికిత్స పొందారు. అయితే గతంలో కూడా బాధితులకు ఒక్కొక్కరికి రూ.75 వేలు చొప్పున రాష్ట్ర మంత్రి సీదిరి అప్పలరాజు చేతులు మీదుగా అందజేశారు. ఆర్థిక సహకారానికి కృషి చేసిన మంత్రి సీదిరి అప్పలరాజుకు బాధితులతో పాటు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పి.గురయ్యానాయుడు, పార్టీ నాయకులు పి.శ్రీనివాసరావు, ఇరోతు హేమంత్, పుక్కళ్ల లక్ష్మణ్, బి.జోగారావు, కె.వి ఫ్లుష్ తదితరులు కృతజ్ఞతలు తెలియజేసారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని వారు తెలిపారు.

ఎన్‌బీఏ అక్రిడేషన్‌పై హర్షం

శ్రీకాకుళం న్యూకాలనీ: జిల్లాలోని ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని ఈసీఈ బ్రాంచ్‌కు నేషనల్ బోర్డ్ అక్రిడేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించింది. 2023 నుంచి 2026 వరకు అక్రిడేట్ చేస్తున్నట్టు అధికారికంగా వర్తమానం లభించింది. ఇదే విషయాన్ని ఆ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పి.శ్రీనివాస్ వెల్లడించారు. ఎన్‌బీఏ బృందం ఈ ఏడాది ఫిబ్రవరి 3 నుంచి 5వ తేదీ వరకు ఆమదాలవలస పాలిటెక్నిక్ కళాశాలను పరిశీలించింది. కళాశాల ప్రగతి, సాధించిన ఫలితాలు, వసతులు, ల్యాబ్‌లు, లైబ్రరీ, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించి సంతృప్తి చెందిన తర్వాత అక్రిడేషన్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఇందుకు సహకరించిన ప్రజాప్రతినిధులు, కమిషనర్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ అండ్ ఎస్‌బీటీఈ చైర్మన్ సి.నాగరాణి, ఎస్‌బీటీఈ సెక్రటరీ విజయభాస్కర్, డిప్యూటీ సెక్రటరీ లక్ష్మీపతి, జిల్లా ఉన్నతాధికారులు, కళాశాల మెకానికల్ విభాగ అధిపతి అన్నెపు గోపి, ఇతర అధ్యాపకులకు, సిబ్బందికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



బలగలోని భారతి ఐటీఐ వద్ద సీతారాముల కల్యాణ వేడుకలు



శ్రీకాకుళంలోని కోదండ రామాలయం వద్ద తాళిబొట్టును భక్తులకు చూపిస్తున్న అర్చకులు



హిరమండలం: సీతారాములకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు



ఆమదాలవలస: ప్రధాన రహదారిపై సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

నువ్వలరేవులో ..

వజ్రపుకొత్తూరు రూరల్: నువ్వలరేవులో గురువారం కన్నుల పండువగా సీతారాముల కల్యాణం జరిగింది. గ్రామస్తులు, పరిసర ప్రాంతాల నుంచి భక్తులు గ్రామానికి చేరుకోవడంతో గ్రామం కిక్కిరిసింది.



పూజలు అందుకుంటున్న సీతారాములు



ఎచ్చెర్ల క్యాంపస్: ఆర్మ్‌డ్ రిజర్వ్ కార్యాలయంలోని కోదండ రామాలయంలో ఎస్పీ రాధిక దంపతుల పూజలు



గార: శ్రీకూర్మనాథాలయంలో శ్రీనవమి వేడుకలు



శ్రీకాకుళంలోని బలగ ఆలయంలో..



శ్రీకాకుళం కోదండ రామాలయం వద్ద కల్యాణోత్సవానికి హాజరైన భక్తులు

సీతా కల్యాణ వైభోగమే

జానకి రాముల జంట భక్తకోటికి కన్నుల పంటగా కనిపించింది. జగదభిరాముని పరిణయాన్ని జగమంతా తన్మయత్వంతో తిలకించి పులకించింది. శ్రీరామ నవమి సందర్భంగా ఊరూవాడా సీతారాముల పెళ్లి చేసి మురిసిపోయాయి. వేదమంత్రాలు, పెళ్లి సందళ్లతో కోవెలలు కల్యాణ మండపాలుగా కనిపించాయి.

-సాక్షి నెట్‌వర్క్

మూల్యాంకనానికి రెడీ



ఎగ్జామినర్లు జవాబు పత్రాలను దిద్దేందుకు సిద్ధం చేసిన ఫర్నీచర్

- రేపటి నుంచి ఇంటర్మీడియెట్ మూల్యాంకనం
- శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల వేదికగా ఏర్పాట్లు
- నాలుగు విడతల్లో జరగనున్న స్పాట్ ప్రక్రియ



స్పాట్ వాల్యుయేషన్ జరగనున్న శ్రీకాకుళం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఇదే

శ్రీకాకుళం న్యూకాలనీ: ఇంటర్ పరీక్షలకు సంబంధించిన జవాబు పత్రాల మూల్యాంకనం (స్పాట్ వాల్యుయేషన్)కు రంగం సిద్ధమైంది. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కాలేజీ వేదికగా శనివారం నుంచి ఈ ప్రక్రియ మొదలుకానుంది. అయితే ఈనెల 20 నుంచి సంస్కృతం పేపర్ల దిద్దుబాటు ప్రక్రియ మొదలైయింది. మూల్యాంకనం కోసం అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రధాన ద్వారంతోపాటు మూల్యాంకనం జరగనున్న అన్ని గదుల్లోను సీసీ కెమెరాలను అమర్చుతున్నారు. సీసీ కెమెరాలను ఆన్‌లైన్ స్ట్రీమింగ్ చేశారు. దిద్దుబాటులో జరిగే తప్పులు, దోషాలకు ఎగ్జామినర్లు, సిబ్బంది మూల్యం చెల్లించుకోకతప్పదని అధికారులు హెచ్చరిస్తున్నారు.

నాలుగు విడతల్లో..

2.60 లక్షల జవాబుపత్రాలు జిల్లాకు చేరు కుంటున్నాయి. ఇందులో ప్రథమ, ద్వితీయ సంవత్సరానికి సంబంధించి 13 ప్రధాన సబ్జెక్టుల జవాబుపత్రాలు చేరుకుంటున్నాయి. జవాబు పత్రాల మూ ల్యాంకనం మొత్తం నాలుగు విడతల్లో జరగనుంది. ఇదిలా ఉండగా ఒక ఎగ్జామినర్ పూటకు 15 చొప్పున రోజుకు 30 పేపర్లు దిద్దాల్సి ఉంటుంది. ఒక పేపర్(స్క్రిప్ట్)కు రూ.18.93 చెల్లిస్తారు. ఈ లెక్కన రోజుకు రూ.597.90 చెల్లించనున్నారు. వీటితోపాటు టీఏ, డీఏ, లోకల్ కన్వీనియన్స్/అవుట్‌స్టేషన్ అలవెన్స్ ఇలా చెల్లించే మొత్తాన్ని వారి బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేయనున్నారు. అన్ని సబ్జెక్టులకు కలిపి మూల్యాంకనంలో మొత్తం 1800 మంది వరకు సిబ్బందిని నియమిస్తున్నారు.

సిబ్బంది నియామకం పూర్తి..

ఎగ్జామినర్ల నియామక ఆర్డర్లను ఇంటర్మీడియెట్ బోర్డు ఇప్పటికే కళాశాలలకు చేరవేసింది. పేపర్ వాల్యుయేషన్ ప్రక్రియలో భాగంగా స్పాట్ క్యాంప్ ఆఫీసర్‌గా ఆర్ఐఓ ఎస్.తవిటినాయుడు వ్యవహరిస్తున్నారు. జనరల్-1 బొమ్మలాట శ్యామ్‌సుందర్ (ప్రిన్సిపాల్- ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆమదాలవలస), జనరల్-2గా కీర్తి తవిటినాయుడు (ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల కొయ్యాం) సీసీఓ-1 మొదలవలస కృష్ణవేణి (ప్రిన్సిపాల్- శ్రీకాకుళం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల), సీసీవో-2 పి.రామ్‌మనోహర్ (ప్రిన్సిపాల్-ప్రభుత్వ జూనియర్ కళాశాల పొందూరు) నియామకమయ్యారు. కోడింగ్ ఆఫీసర్లు, ఏసీవోలు, సబ్జెక్టు ఎక్స్‌పర్ట్స్, చీఫ్ ఎగ్జామినర్లు, అసిస్టెంట్ ఎగ్జామినర్లు, స్క్రూటినైజర్ల నియామక ప్రక్రియ పూర్తయ్యింది. నియామక ఉత్తర్వులు సైతం వారి కాలేజీలకు చేరుకున్నాయి. అవసరమనుకుంటే స్పాట్ ఉత్తర్వులు రాని వారిని సైతం మూల్యాంకనానికి తీసుకోవచ్చు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



జిల్లాలో రేపటి నుంచి ప్రారంభంకానున్న ఇంటర్మీడియట్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనానికి దాదాపుగా అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. సిబ్బంది నియామకం పూర్తయ్యింది. నియామక ఉత్తర్వులను కళాశాలలకు చేరవేశాం. వారివారి స్పెల్స్‌ను బట్టి విధులకు హాజరుకావాల్సి ఉంటుంది. సెల్‌ఫోన్లకు అనుమతి లేదు. సీసీ కెమెరాలను అమర్చి, స్ట్రీమింగ్ చేపించాం. బోర్డు ఉన్నతాధికారులు కూడా పర్యవేక్షించవచ్చు. దిద్దుబాటులో అలసత్వం ప్రదర్శించి తప్పులు చేస్తే మూల్యం చెల్లించుకోక తప్పదు. ఎంతటివారైనా కచ్చితంగా చర్యలు ఉంటాయి.

- ఎస్.తవిటినాయుడు, ఆర్ఐఓ/ఇంటర్ స్పాట్ క్యాంప్ ఆఫీసర్ శ్రీకాకుళం

షెడ్యూల్ ఇది..



విడత	మొదలయ్యే తేదీ	దిద్దనున్న సబ్జెక్టులు
1వ స్పెల్	ఏప్రిల్ 1 తేదీ నుంచి	తెలుగు, హిందీ, ఇంగ్లీషు, మ్యాథ్స్, సివిక్స్
2వ స్పెల్	ఏప్రిల్ 3 నుంచి	ఫిజిక్స్, ఎకనామిక్స్
3వ స్పెల్	ఏప్రిల్ 5 నుంచి	కెమిస్ట్రీ, హిస్టరీ
4వ స్పెల్	ఏప్రిల్ 8 నుంచి	కామర్స్, బోటనీ, జువాలజీ

సుస్వర ప్రస్థానం



కీబోర్డు వాయిస్తున్న నాగేశ్వరరావు

- 12 దేశాల్లో ఆన్‌లైన్ క్లాసులు చెబుతున్న సంగీత గురువు
- లండన్ ట్రినిటీ కాలేజ్‌కు శిష్యులను పంపిస్తున్న వైనం
- పుష్కర కాలంగా స్వరార్చన చేస్తున్న పెంకి నాగేశ్వరరావు

శ్రీకాకుళం కల్చరల్: సంగీతం నేర్చుకోవాలనే పట్టుదల ఆయన చేత ప్రతినిత్యం డబ్బై కిలోమీటర్ల దూరం వెళ్లడానికి సాహస ప్రయాణాలు చేయించింది. గానంతో సాంగత్యం కుదరడానికి ఏళ్లకు ఏళ్ల సాధన అవసరమైంది. స్వర జతులతో జత కుదిరాక.. ఆయన కోసం పన్నెండు దేశాల్లోని శిష్యులు వేచి చూసే స్థాయి దక్కింది. పీహెచ్‌డీలు చేసిన వారు సైతం 'మా గురువు నాగేశ్వరరావు మాస్టారు' అని చెప్పుకుంటుంటే విని తరించే భాగ్యం కలిగింది. సంగీత దర్శకునిగా అవకాశాలు వచ్చినా సరిగమల మాస్టారు గానే ప్రయాణం సాగిస్తున్న పెంకి నాగేశ్వరరావు సిక్కోలు ప్రజలకు తెలియాల్సిన పేరు. శ్రీకాకుళంలోని కలెక్టర్ బంగ్లా ఎదురుగా నివాసం ఉంటున్న నాగేశ్వరరావు 13 ఏళ్లుగా సంగీతం గురువుగా రాణిస్తున్నారు. 12 దేశాల్లోనే శిష్యులకు ఆన్‌లైన్‌లో క్లాసులు చెబుతున్నారు. ఆయన ప్రయాణం అందరికీ ఆదర్శ ప్రాయం..

చిన్నప్పటి నుంచే..

సంగీతంపై చిన్నప్పటి నుంచి ఇష్టం పెంచుకున్న నాగేశ్వరరావుకు సంగీత సాధన అంత సులువుగా జరగలేదు. శ్రీకాకుళంలోని పాలిటెక్నిక్ కాలేజీలో ఓ వైపు చదువుతూ విజయనగరం సంగీత కాలేజీకి వెళ్లి తరగతులకు హాజరయ్యేవారు. బస్సుల్లో ప్రయాణించేందుకు డబ్బుల్లేక లారీల పై వెళ్లేవారు. ఆయన 1998లో మొదటిగా అప్పారావు మాస్టారు వద్ద హార్మోనియం, గాత్రం నేర్చుకున్నారు. 2009నుంచి హైదరాబాద్‌లో నివాసం ఉంటూ సంగీత గురువుగా ప్రయాణం మొదలుపెట్టారు. ఆ ప్రస్థానం విజయవంతంగా సాగింది. 2012లో లండన్‌లోని ప్రఖ్యాత ట్రినిటీ కాలేజీకు తన శిష్యులను పంపించడం మొదలుపెట్టారు. 2018-19 నుంచి అదే కాలేజీలో ఆన్‌లైన్ పాఠాలు కూడా చెప్పారు. ఏడాదికి రెండు విడతలుగా విద్యార్థులకు శిక్షణ ఇచ్చి పరీక్షలకు పంపుతుంటారు. ఆయన వద్ద సంగీతం నేర్చుకున్న 16మంది విద్యార్థులు మ్యూజిక్‌లో ఎంఏ పూర్తిచేశారు. అందులో నలుగురు పీహెచ్‌డీ కోసం సిద్ధమవుతున్నారు. అమెరికా, కెనడా, దుబాయ్, జర్మనీ, యూకే తదితర దేశాల్లోని సంగీత ప్రియులకు ఆయన ఆన్‌లైన్‌లో క్లాసులు చెబుతున్నారు. గాత్రంతో పాటు కీబోర్డు, గిటార్ కూడా నేర్పిస్తున్నారు.

13 ఏళ్లుగా..



ఇంటిలో సంగీత శిక్షణ

ఆయన రాష్ట్రంలో ఎనిమిది చోట్ల సంగీత శాఖలను ప్రారంభించారు. హైదరాబాద్, గుంటూరులో స్కూల్స్ నిర్వహిస్తున్నారు. రోజుకు 12 గంటలు క్లాసులు జరుగుతాయి. లోకల్‌లో ప్రతి సాయంత్రం క్లాసులు జరుగుతాయి. ఆయన వద్ద నేర్చుకున్న వారిలో మ్యూజిక్ టీచర్లుగా 9 మంది పనిచేస్తున్నారు. చాలా మంది మ్యూజిక్ డైరెక్టర్లు కూడా అయ్యారు. ఆయన కెనడాలో గ్రేట్ ఇండియా ఫెస్టివల్‌కు మ్యూజిక్‌ను అందించారు.

ఎన్నో రాగాలు సృష్టించవచ్చు..

ఒక రాగం నుంచి ఎన్నో రాగాలు పుడతాయి. నా వద్దకు నేర్చుకునేందుకు వచ్చే వారికి రాగంలోని సారాంశాన్ని నేర్పుతూ వారు స్వయంగా కొత్త రాగాలు కనిపెట్టే విధంగా శిక్షణ ఇస్తుంటాను. సంగీతం అనేది అంతులేనిది. మూలమైన రాగాలు కొన్నే ఉన్నా వాటి నుంచి సృష్టించే రాగాలకు కొదవలేదు. సినిమా మ్యూజిక్ డైరెక్టర్‌గా వచ్చిన ఆఫర్‌లను వదులుకుని విలువైన సంగీతాన్ని పదిమందికి అందించడమే లక్ష్యంగా పెట్టుకున్నాను.

– పెంకి నాగేశ్వరరావు, సంగీతకారుడు

దశ సహస్ర వర్ణాల్లో..



మండలంలోని అవలింగి శ్రీ నీలమణి అమ్మవారిని గురువారం 10వేల చీరలతో అలంకరించి శోభాయాత్ర నిర్వహించారు. ఆలయంలో చైత్రమాస త్రిరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం నుంచి ఆలయంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. దీంట్లో భాగంగా గురువారం అవలింగి, బుడితి, చీడిపూడి గ్రామాల్లోని భక్తులు ఇంటికి ఒక చీర చొప్పున అమ్మవారికి అలంకరించారు.

-సారవకోట

ఆపిల్ కాసెను..!

మండలంలోని మహసింగి గ్రామంలో ఆపిల్ చెట్టు కాపు కాసింది. స్థానిక శ్రీవెంకటేశ్వర విద్యాసంస్థల చైర్మన్ జి.కృష్ణారావు రెండేళ్ల కిందట కొత్తూరు నర్సరీ నుంచి ఓ ఆపిల్ మొక్క ను తెచ్చి తన ఇంటి ఆవరణలో నాటారు. మొక్క నాటిన రెండేళ్లకు దీనికి పూత రావడం ఆరంభమైంది. సిమ్లా వంటి చల్లటి ప్రదేశాల్లోనే ఆపిళ్లు కాస్తాయని అనుకుంటారు. కానీ మహసింగిలో ఈ చెట్టుకు కాయలు కాయడంతో అంతా ఆశ్చర్యంగా చూశారు.

-కొత్తూరు



సైకిల్ యాత్ర



పాండిచ్చేరికి చెందిన కె.రాజా జ్యోతిర్లింగాల సందర్శనకు సైకిల్ యాత్ర చేస్తున్నారు. ఆరు నెలల కిందట రామేశ్వరంలో యాత్ర ప్రారంభించినట్లు తెలిపారు. అమర్‌నాథ్‌కు వెళ్లేదారిలో 16వ నంబర్ జాతీయ రహదారిపై గురువారం కనిపించారు. నరసన్నపేట బైపాస్ వద్ద విలేకరులతో మాట్లాడుతూ 12 జ్యోతిర్లింగాలను సైకిల్‌పై తిరుగుతూ దర్శనం చేసుకోవాలనేది తన మొక్కు అని తెలిపారు. లోకకల్యాణార్థం యాత్ర చేస్తున్నానన్నారు. మార్గం మధ్యలో ప్రసిద్ధి చెందిన ఆలయాలను దర్శించుకుంటున్నానని చెప్పారు.

-నరసన్నపేట

కాశీపట్నం చూడరబాబు!

- రూ.2లకే చిన్నారులకు బయోస్కోప్ సినిమాలు
- అంతరించిపోతున్న జ్ఞాపకాలను కాపాడుతున్న తాతారావు

టెక్కలి రూరల్: సుమారు మూడు నాలుగు దశాబ్దాల కిందటి మాట. అర్ధ రూపాయికే సినిమా చూపిస్తామంటూ బయోస్కోప్‌లాంటి ఓ పెట్టెను పట్టుకుని కొందరు వీధుల్లో తిరిగే వారు. సినిమా ప్రొజెక్టర్లలో వాడే రీల్‌ను అందులో ఉంచి బుల్లి సినిమాను చూపించేవారు. అది చూసి పిల్లలు ఆనందంతో ఎగిరి గంతేసేవారు. తర్వాత టీవీలు, ఫోన్లు రావడంతో ఆ కళ అంతరించిపోయింది. అయితే టెక్కలి ఆదిఆంధ్ర వీధికి చెందిన దండాసి తాతారావు మాత్రం బయోస్కోప్‌ను వీడలేదు. నేటికీ పాఠశాలలు విడిచిపెట్టే సమయంలో పిల్లల వద్దకు వెళ్లి రూ.2 తీసుకుని బొమ్మల సినిమాలు చూపిస్తూ ఆకట్టుకుంటున్నాడు. గతంలో ప్రతి ఊరులో మూడు, నాలుగు కుటుంబాలు ఈ వృత్తిపై జీవించేవారని, ప్రస్తుతం తానొక్కడినే ఈ బొమ్మల చిత్రాలను చూపిస్తున్నానని తాతారావు చెబుతున్నారు. వీటిని కాకినాడ నుంచి తీసుకొచ్చినట్లు తెలిపారు.



బయోస్కోప్‌లో పిల్లలకు సినిమాలు చూపిస్తున్న తాతారావు

క్లుప్తంగా

జింకపై కుక్కల దాడి



జోగికొండలో వాటర్ టబ్బులు పెడుతున్న అటవీశాఖ సిబ్బంది

పాతపట్నం: మండల కేంద్రంలోని ఇందిరమ్మ కాలనీ వద్ద కుక్కలు చుక్కల జింకపై దాడి చేసి చంపేశాయి. జోగికొండ నుంచి గురువారం ఉదయం నీటి కోసం జింక కిందకు రావడంతో కుక్కలు చూసి వెంబడించి దాడి చేశాయి. స్థానికులు దీన్ని చూసి కుక్కలను తరిమి జింకకు తమ వద్ద రక్షణ కల్పించారు. అటవీ శాఖకు సమాచారం అందించడంతో వారు వచ్చి తమ కార్యాలయానికి తీసుకెళ్లారు. అయితే కాసేపటికే జింక చనిపోయింది. కుక్కల దాడిలో జింకలు చనిపోవడం ఈ మధ్య పెరిగిపోతోంది. గురువారం ఉదయమే ఫారెస్ట్‌లో వాటర్ టబ్బులను ఏర్పాటు చేశారు. అయినా జింక కిందకు రావడంతో కుక్కల దాడిలో మృతిచెందింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



కోరాడ రాధాకృష్ణ (ఫైల్)

గార: మండలంలోని నిజామాబాద్ గ్రామం వద్ద సీఎస్పీ రోడ్డులో గురువారం జరిగిన ప్రమాదంలో వ్యక్తి మృతి చెందారు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం శ్రీకూర్మం కోవెలవీధికి చెందిన కోరాడ రాధాకృష్ణ (57) తన కుమార్తె కోరాడ సునీత (తోనంగి వీఆర్‌ఓ), మనవడితో కలసి గురువారం సాయంత్రం బైక్‌పై గార నుంచి శ్రీకూర్మం వైపు వెళ్తున్నారు. అదే సమయంలో నిజామాబాద్ గ్రామానికి భైరి లచ్చయ్య నడుచుకుంటూ వస్తుండగా బైక్ ఆయనకు తగిలి అంతా కింద పడిపోయారు. రాధాకృష్ణ తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందారు. కుమార్తె, మనవడికి స్వల్పంగా గాయాలయ్యాయి. భైరి లచ్చయ్యకు కూడా స్వలంగా గాయాలయ్యాయి.

అనాథ పిల్లలపై 'వాత్సల్యం'



అనాథ పిల్లల వివరాల కోసం సర్వే చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

- నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న 18 ఏళ్ల లోపు చిన్నారులు అర్హులు
- నెలకు రూ.4 వేలు చొప్పున సహాయం
- దరఖాస్తు చేసుకునేందుకు ఏప్రిల్ 5 వరకు గడువు

రణస్థలం:

అనాథలు, నిస్సహాయ స్థితిలో ఉన్న పిల్లలకు నెలకు రూ.4 వేలు సాయం అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకువచ్చాయి. 2019 కోవిడ్ సమయంలో తల్లిదండ్రులు చనిపోయి ఎంతో మంది పిల్లలు అభాగ్యులుగా, అనాథలుగా మారడంతో వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు స్పాన్సర్‌షిప్‌ను ప్రవేశపెట్టాయి. రాష్ట్ర ప్రభుత్వం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్య పథకం(ఐసీపీఎస్)లో భాగంగా జిల్లా బాలల రక్షణ విభాగం ద్వారా ఈ కార్యక్రమం అమలు చేస్తోంది.

కేంద్ర, రాష్ట్రాల భాగస్వామ్యంతో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా 60:40 నిష్పత్తిలో నిధులు విడుదల చేస్తున్నాయి. ఒక్కొక్కరికి కేంద్ర ప్రభుత్వం రూ.2400 అందజేస్తే, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.1600 ఇస్తుంది. నిరుపేద, నిస్సహాయ స్థితిలో ఉన్న కుటుంబాల సంరక్షణ, ఆదరణ అవసరమైన పిల్లలు, వారి తల్లిదండ్రుల రక్త సంబంధీకులు, సంరక్షకులతో నివసిస్తూ విద్యను కొనసాగించేందుకు స్పాన్సర్‌షిప్ మంజూరు చేస్తున్నారు.

అర్హులు వీరే..

- వితంతువు, విడాకులు తీసుకున్న తల్లి పిల్లలు.
- తల్లిదండ్రులు కోల్పోయి ఇతర కుటుంబంలో నివసిస్తున్న అనాథ పిల్లలు.
- ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న తల్లిదండ్రుల పిల్లలు.
- పిల్లలను పెంచలేని స్థితిలో ఉన్న వారి బాలలు.
- బాల న్యాయ (రక్షణ అండ్ ఆదరణ) చట్టం – 2015 ప్రకారం ఆదరణ అవసరమైన చిన్నారులు.
- బాల కార్మికులు, బాల్య వివాహాల, అక్రమ రవాణాకు గురైనవారు, హెచ్ఐవీ బాధిత పిల్లలు, వికలాంగులు, తప్పిపోయిన, పారిపోయిన పిల్లలు, యాచక పిల్లలు, వీధుల్లో నివసిస్తున్న వారి పిల్లలు, హింసకు గురైన, దోపిడీకి గురైన, పిల్లలు అనాథ ఆశ్రమాలలో బాలలు.
- పీఎం కేర్ ఫర్ చిల్డ్రన పథకం పొందుతున్న చిన్నారులు.
- కుటుంబ వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాలలో రూ. 72వేలు, పట్టణ ప్రాంతాల వారికి రూ. 96 వేలు మించరాదు.

ఏప్రిల్ 5 వరకు దరఖాస్తు

గత ఏడాదికి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 683 మంది పిల్లలకు నెలకు రూ. 4వేలు చొప్పున 7 నెలలు మొత్తాన్ని ఈ నెల 20వ తేదీన పిల్లలు, సంరక్షకుల అకౌంట్‌లలో జమ చేశారు. 2023 ఏప్రిల్ నుంచి ఇంకా గత ఏడాదిలో చేరని అనాథ పిల్లలను వివరాలను సేకరించేందుకు అన్ని మండలాల్లోని మహిళ, శిశు సంక్షేమ అధికారి (సీడీపీఓ)లకు బాధ్యత అప్పగించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4192 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ఈ సేకరణ జరుగుతుంది. చైర్‌పర్సన్‌గా కలెక్టర్ అధ్వర్యంలో జిల్లా మహిళ, శిశు సంక్షేమ సాధికారత అధికారి, సీడబ్ల్యూసీ అధికారి, డీసీపీఓ అధికారి, ఏస్‌బీసీపీఓ అధికారి, శిశు గృహ సంక్షేమ అధికారి, ఒక ఎన్‌జీఓ అధికారి సభ్యుల పర్యవేక్షణలో అర్హుల ఎంపిక విధానం జరుగుతుంది.

దరఖాస్తు చేసుకోవాలి..

కలెక్టర్ ఆదేశాల మేరకు ఏప్రిల్ 5లోపు కొత్తగా ఉన్న అనాథ పిల్లలు దరఖాస్తు చేసుకోవాలి. 2022లో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 4192 అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా 683 పిల్లలను గుర్తించాం. ఈ ఏడాది మిషన్ వాత్సల్య పథకంలో భాగంగా స్పాన్సర్ షిప్ ఇచ్చేందుకు సర్వే చేస్తున్నాం.

– కె.అనంతలక్ష్మి, జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి

కన్నీటి కథ



కేన్సర్ వ్యాధితో మంచాన పడిన మహాలక్ష్మి

- కేన్సర్ బారిన పడిన మహిళ
- వైద్యానికి సరిపోని ఆర్థిక స్థోమత
- కొడుకు కూడా దివ్యాంగుడు
- సాయం కోసం ఎదురుచూపు

వజ్రపుకొత్తూరు రూరల్:

కొడుకు దివ్యాంగుడు. మాటలు రావు, వినిపించవు. భార్య గొంతు కేన్సర్ బాధితురాలు. ఏడు నెలల కాలంగా మంచానికే పరిమితమయ్యారు. రోజూ కూలి పనికి వెళ్తే గానీ రోజు గడవని ఆర్థిక స్థితి ఆయనది. పనికి వెళ్లకపోతే కడుపు నిండదు. వెళ్తే భార్యాకొడుకులను చూసుకునే వీలుండదు. ఆరు నెలల పాటు ఆరోగ్యశ్రీపై భార్యకు చికిత్స అందజేసినా ఇంకా వైద్యం చేయాల్సి ఉండడంతో ఆ ఇంటి యజమాని చితికిపోతున్నాడు. ఎంత కష్టపడుతున్నా వస్తున్న సంపాదన సరిపోవడం లేదని.. ఈ కష్టకాలంలో దాతలు సాయం చేస్తే తన కుటుంబాన్ని బతికించుకుంటానని కోరుతున్నారు. పూర్తి వివరాల్లోకి వెళితే..

వజ్రపుకొత్తూరు మండలం బెండి గ్రామానికి చెందిన అల్లాడ జనార్దన, మహాలక్ష్మి దంపతులు రోజు వారి కూలి పనులు చేసుకుంటూ బతుకుతున్నారు. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. అతను పుట్టుకతోనే దివ్యాంగుడు. చిన్నప్పుడు రూ. లక్షలు ఖర్చు పెట్టి వైద్యం చేయించినా ఫలితం కనిపించలేదు. అతనికి మాటలు రావు, వినిపించదు కూడా. దివ్యాంగుడే అయినా పింఛన్‌కు నోచుకోలేదు. తల్లిదండ్రుల రెక్కల కష్టంతోనే ఆ కుటుంబం కడుపు నిండుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో ఏడు నెలల కిందట మహాలక్ష్మి అనారోగ్యానికి గురయ్యారు. ఆస్పత్రులన్నీ తిప్పితే గొంతు కేన్సర్ అని తెలిసిందే. దీంతో జనార్దన గుండె ల్లో రాయి పడింది. ఆస్పత్రుల చుట్టూ తిరిగే సరికి రూ.2.5 లక్షలు ఖర్చైపోయింది. కూలి పనులు చేసుకునే వీరికి ఇది చాలా పెద్ద మొత్తం. తర్వాత ఆరోగ్య శ్రీ ద్వారా విశాఖలో మహాలక్ష్మికి కీమోథెరపీ చేశారు. ఇప్పుడు ఇంటికి వచ్చారు. కానీ ఇంకా చికిత్స చేయాల్సి ఉండడం, చేతిలో చిల్లిగవ్వ కూడా లేకపోవడంతో జనార్దన సాయం కోరుతున్నారు. ప్రతి రోజూ కూలి పనికి వెళ్లి సరైన వైద్యం చేయించలేనని, మనసున్న వారు తమను ఆదుకోవాలని విన్నవిస్తున్నారు.



ఆర్థిక సాయం కోసం ఎదురు చూస్తున్న కుటుంబం

సాయం చేయాలనుకునే వారు 90101 31531 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నా భార్యకు ప్రాణభిక్ష పెట్టండి



మేం కూలి పనులు చేసుకుంటూ బతికే వాళ్లం. నా కుమారుడు దివ్యాంగుడు. ఇప్పుడు నా భార్య గొంతు కేన్సర్‌తో బాధపడుతోంది. వైద్యం కోసం రూ.లక్షల్లో ఖర్చు పెట్టాను. ఇప్పుడు ఇంకా వైద్యం చేయించే స్తోమత నాకు లేదు. దాతలే ఆదుకోవాలి.

– అల్లాడ జనార్దన

'మార్ట్ వాహనం వినియోగించుకోండి'

కొత్తూరు: మొబైల్ రూరల్ మార్ట్ వాహనాన్ని రైతులు వినియోగించుకోవాలని నాబార్డు డీడీఎం వరప్రసాదరావు కోరారు. మండలంలోని మెట్టూరు బిట్–3 ఆర్‌ఆర్ కాలనీలో రూరల్ మార్ట్ వాహనాన్ని డీడీఎం గురువారం ప్రారంభించారు. చిన్నయ్య ఆదివాసీ వికాస్ సంఘం ఆధ్వర్యంలో మెట్టూరు బిట్–3లో ఏర్పాటు చేసిన వంశధార ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్‌కు మార్ట్ వాహనాన్ని అందించినట్లు డీడీఎం చెప్పారు. రైతులు తామ పండించిన పంటలను మార్కెట్ ఉన్న చోటకు ఈ వాహనం ద్వారా తరలించుకోవచ్చని తెలిపారు. అయితే దీని కోసం అద్దె చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు. అలాగే పొలాల్లో ఉన్న పంటలను ఇంటికి, మార్కెట్‌కు అద్దె చెల్లించి తరలించుకునే సౌలభ్యం కూడా ఉందని పేర్కొన్నారు. అనంతరం సంఘం అభివృద్ధి గురించి చర్చించారు. ఎదగడానికి కావాల్సిన అంశాలపై అవగాహన కల్పించారు. వాహనాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ఉత్పత్తుల రవాణాకు ఈ వాహనాన్నే వాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొయిలాపు శ్రీనివాసరావు, పలు సంఘాల సీఈఓలు కైలాస్ చంద్ర సాహు, డి.సుజాత, నరేంద్ర, రాంబాబు,తులసి, ధర్మరాజులతో పాటు పలువురు పాల్గొన్నారు.



మెట్టూరు బిట్–3లో మొబైల్ మార్ట్ వాహనాన్ని ప్రారంభిస్తున్న నాబార్డు డీడీఎం వరప్రసాదరావు

కేన్సర్ బాధిత చిన్నారికి ఆర్థిక సాయం

కంచిలి: మండలంలోని పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన ఐదేళ్ల చిన్నారి లండ యుగంధర్ కేన్సర్‌తో బాధ పడుతున్న సంగతి తెలిసిందే. చిన్నారి పరిస్థితిపై 'సాక్షి'లో కథనం కూడా ప్రచురితమైంది. కవిటి మండలం భైరిపురం గ్రామానికి చెందిన రేస్ ఫౌండేషన్ చైర్మన్ పుల్లట ప్రవీణ్ బాధిత బాలుడి కుటుంబానికి తన వంతుగా రూ.5వేలు ఆర్థిక సాయం చేశారు. చిన్నారికి మెరుగైన వైద్యం అందించడం కోసం హైదరాబాద్‌లోని ప్రముఖ క్యాన్సర్ ఆస్పత్రిని సంప్రదించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు గొనప రవి,బిసాయి రవి, బల్లెడ మురళీకృష్ణ పాల్గొన్నారు.

సిక్కోలు ఉద్దానం సేవా సమితి సాయం..

పెద్దశ్రీరాంపురం గ్రామానికి చెందిన క్యాన్సర్ బాధిత చిన్నారి లండ యోగేంద్ర వైద్యం కోసం సిక్కోలు ఉద్దానం సేవా సమితి వారు రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు కామేష్‌రెడ్డి, కామేష్, హరి, వేణు, అనిల్, శరత్ రామారావు, గ్రామస్తులు పాల్గొన్నారు.

9న అమరావతి జేఏసీ సమావేశం

శ్రీకాకుళం న్యూకాలనీ: విజయవాడలోని రెవెన్యూ భవన్ వేదికగా ఏప్రిల్ 9న జరగనున్న అమరావతి జేఏసీ సమావేశానికి భాషాపండితులు, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున హాజరు కావాలని రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ శ్రీకాకుళం జిల్లా శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి పిసిని వసంతరావు, కూన రంగ నాయకులు కోరారు. ఈ సమావేశంలో డీఈఓ పూల్‌లో మిగిలిన తెలుగు,హిందీ, ఒడియా కన్నడం, సంస్కృతం భాషా పండితులు సుమారుగా 1361 మంది రాష్ట్రవ్యాప్తంగా ఎదుర్కొంటున్న పలు సమస్యల పరిష్కారానికి కీలక తీర్మానాలు చేయనున్నారని తెలిపారు. జిల్లాలో డీఈవో పూల్ భాషా పండితులతో సహా భాషోపాధ్యాయులంతా పెద్దఎత్తున హాజరుకావాలని వారు కోరారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	59,670–00
బంగారం(22సి. 10గ్రా.)	54,700–00
వెండి (కిలో)	76,000–00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹113	₹196	₹ 206

క్రీడలతో ఉద్యోగ అవకాశాలు: ఎస్పీ

పలాస: యువత, క్రీడాకారులు నేరాల వైపు వెళ్లవద్దని, ఒక్కసారి తప్పు చేస్తే జీవితంలో దాన్ని సరిదిద్దుకోలేరని ఎస్పీ జీఆర్ రాధిక అన్నారు. పలాస మండలంలోని బొడ్డపాడు గ్రామంలో కాశీబుగ్గ పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలు గురువారం రాత్రితో ముగిశాయి. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భవిష్యత్‌లో ప్రభుత్వ ఉద్యోగాలు సంపాదించేందుకు క్రీడలు దోహద పడతాయన్నారు. స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగాలు సంపాదించుకునే అవకాశం కేంద్ర ప్రభుత్వాలు మనకు కల్పించాయన్నారు. క్రీడాకారులు గెలుపు ఓటములను తేలిగ్గా తీసుకోవాలని సూచించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఉన్న క్రీడాకారులందరూ గ్రామస్థాయి నుంచి వచ్చిన వారేనని గుర్తు చేశారు. గ్రామాల్లో నేరాలు జరిగే సమయంలో జరిగిన సంఘటనలను పోలీసుల దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు.

జిల్లాలో బొడ్డపాడు ప్రాంతానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని, ఇలాంటి ప్రాంతాలకు పోలీసులు సైతం వచ్చేందుకు భయపడేవారని, అలాంటి ప్రాంతంలో క్రీడా పోటీలు నిర్వహించడం, అందుకు స్థానిక సర్పంచ్‌తో పాటు గ్రామస్తులు, యువత సహాయ సహకారాలు అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ముందుగా ఎస్పీ రాధికకు కాశీబుగ్గ డీఎస్పీ శివ రాంరెడ్డి, కాశీబుగ్గ సీఐ శ్రీనివాసరావు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సీఐ శ్రీనివాసులు, సర్పంచ్ తామడ మదన్, ఎంపీటీసీ ఎం.పాపారావు, యాంకర్ శ్రీనివాస బాబ్జి, సరోజవర్మ, పీఈటీలు పోలీసు ఉన్నతాధికారులు క్రీడాకారులు బొడ్డపాడు గ్రామ యువత తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎస్పీ రాధిక

విజేతల వివరాలు

మండలంలోని బొడ్డపాడు గ్రామంలో కాశీబుగ్గ పోలీసులు ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు రసవత్తరంగా సాగాయి. జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో మందస మండలం భేతాళపురం ప్రథమస్థానం, వజ్రపుకొత్తూరు మండలం సైనూరు ద్వితీయ స్థానం, మూడోస్థానంలో పల్లిసారధి, బాతుపురం, నిలిచాయి. క్రికెట్ విభాగంలో ప్రథమ స్థానంలో పలాస మండలం మాకన్నపల్లి, ద్వితీయస్థానం బొడ్డపాడు టీమ్‌లు నిలిచాయి. బ్యాడ్మింటన్ మహిళా విభాగంలో ప్రథమస్థానంలో సానివాడ, రెండోస్థానంలో ఎచ్చెర్ల, మూడోస్థానంలో పలాస మండలం బ్రాహ్మణతర్లా, బాలుర విభాగంలో మొదటిస్థానంలో కాశీబుగ్గ, రెండో స్థానంలో ఎచ్చెర్ల, మూడోస్థానంలో టెక్కలి నిలిచాయి. గెలుపొందిన విజేతలకు ఎస్పీ రాధిక చేతుల మీదుగా నగదుతో పాటు జ్ఞాపికలు అందజేశారు.

క్రీడాకారిణికి అభినందనలు

కంచిలి:

మండలంలోని మామిడిపల్లి గ్రామానికి చెందిన లండ కిరణ్ కుమారి వరుస స్వర్ణ పతకాలతో దూసుకుపోతోంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఈ అమ్మాయి తల్లిదండ్రుల ప్రోత్సాహంతో నెల్లూరులో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్టేట్ తృతీయ సీనియర్, జూనియర్ ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో అద్భుతమైన ప్రదర్శన కనబరిచి గోల్డ్‌మెడల్ సాధించి నేషనల్‌కి ఎంపికైంది. ఈ మేరకు ఆమెకు మామిడి పల్లి గ్రామంలో కుటుంబసభ్యులు, గ్రామస్తులు అభినందన సభను గురువారం నిర్వహించారు. మే నెలలో జరుగనున్న జాతీయస్థాయి ఫ్లోర్ కర్లింగ్ చాంపియన్‌షిప్‌కి ఎంపికైన మొదటి సిక్కోలు క్రీడాకారిణిగా ఆమె గుర్తింపు పొందింది. జాతీయ స్థాయిలో కూడా మంచి గుర్తింపు సాధించి, దేశానికి పేరు తీసుకురావాలని ఆశిస్తున్నామని తండ్రి సూర్యనారాయణ, కోచ్ సురేంద్ర రెడ్డి కోరారు. అనంతరం ఆమెను అభినందించారు.



కిరణ్‌కుమారిని అభినందిస్తున్న కుటుంబ సభ్యులు, గ్రామస్తులు